## క్లుప్తంగా

### విద్యార్థినులకు సత్కారం



**మచిలీపట్నంఅర్బన్:** లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, వృత్తివిద్య కోర్సు ఎమెల్టీ గ్రూపుల్లో మొదటి స్థానం సాధించిన ఏ.బాల త్రిపురసుందరి, ఎం.గాయత్రిలను కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి కొల్లు శ్రీనివాస్ రావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు, అధ్యాపకుల కృషి అభినందనీయమన్నారు. ఫీజులు రాయితీ ఇస్తే ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ర్యాంకులు సాధించిన ఇద్దరు విద్యార్థినులకు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ వి.సుందరలక్ష్మి, అధ్యాపకులు విజయశ్రీ, సురేష్, హిరణ్మయి, సుల్తానా, విద్యార్థులు పాల్గొన్నారు.

### రేపు అవనిగడ్డలో జాబ్‌మేళా

**చిలకలపూడి(మచిలీపట్నం):** జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెటీరో ల్యాబ్స్, ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, కేఎల్ గ్రూప్ తదితర కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఈ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లల్లోపు యువత అర్హులన్నారు. వివరాలకు 63006 18985, 79955 34572 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### స్వచ్ఛ సుందర చల్లపల్లికి విరాళాలు




**చల్లపల్లి:** స్వచ్ఛ సుందర చల్లపల్లికి మేము సైతం అంటూ పలువురు మంగళవారం విరాళాలు అందజేశారు. మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామానికి చెందిన వెలివల సీతారామాంజనేయులు కుమారుడు ఎన్‌ఆర్‌ఐ వెలివల కుటుంబరావు రూ.10 వేలు, స్థానిక మెహర్ రైస్‌మిల్ నిర్వాహకులు చుండూరి ఎం వీఆర్కే ప్రసాద్ రూ.5 వేలు, స్వచ్ఛ కార్యకర్త కడియాల భారతి రూ.2 వేలు మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళాలు అందించారు. ఆయా మొత్తాలను స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు అందజేశారు. ఊరి బాగు కోసం తమ వంతుగా విరాళాలు అందించిన వారిని డీఆర్కే ప్రసాద్ అభినందించారు.

### అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



**బంటుమిల్లి:** బంటుమిల్లి గ్రామంలో అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బస్టాండు, వైఎస్సార్ యానాది కాలనీ, లక్ష్మీపురం సెంటర్లలో ప్రమాదాలను ఎదుర్కొనే విధానాలను వివరించారు. గ్యాస్ సిలిండర్‌లో మంటలు వ్యాపిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రదర్శన ద్వారా చూపించారు. అగ్నిమాపక అధికారి జి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో మొదటిసారి అగ్నిమాపక శకటం లేకుండా వారోత్సవాలు నిర్వహించారు. బంటుమిల్లి కేంద్రంలో వెంటనే అగ్నిమాపక వాహనాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆంజనేయుడికి సపోటాలతో పూజ



**మచిలీపట్నంటౌన్:** నగరంలోని ఈడేపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామివారికి 1,008 సపోటా పండ్లతో పూజ చేశారు. భక్తులు తరకటూరి సీతారాముడు, హేమాద్రి అలివేలు, గుంటుపల్లి బాబురావు, గాజుల భూనాథ్, జోగి గోపాలరావుల కుటుంబ సభ్యులు ఈ పూజను నిర్వహించారు. అలాగే ఆలయానికి విచ్చేసిన భక్తులకు చావ వెంకట రంగనాథ్ కుటుంబ సభ్యులు మజ్జిగను, మేకపోతుల విజయరామ్‌కుమార్, ఆకుల రాగప్రియ, అంకెం శివ కుటుంబ సభ్యులు ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమాలను ఆలయ భక్త బృందం సభ్యులు పర్యవేక్షించారు.

# చెరువుల తవ్వకాలతో అవస్థలు

- సాగునీరు, మురుగునీరు పారని పరిస్థితి
- బొడ్డువానిపాలెం వద్ద చెరువు తవ్వుతారని తెలిసి అడ్డుకుంటున్న వైనం
- గతంలోనూ కలెక్టర్‌కు ఫిర్యాదు
- వెయ్యి ఎకరాలకు పైగా దెబ్బతింటాయని నందిగామ రైతుల ఆవేదన



చెరువు తవ్వి మట్టిని తరలించేందుకు వేసిన తూములను తొలగించిన దృశ్యం



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

**పెడన:** సడా యాక్ట్ రావడంతో స్థానిక అధికారుల అనుమతులు లేకుండా నేరుగా ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకొని చెరువులుగా మార్చేస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను పట్టించుకోకుండా అనుమతులు ఏ విధంగా మంజూరు చేస్తారంటూ వాపోతున్నారు. పెడన మండలం నందిగామ రైతుల ఆవేదన వారి మాటల్లో.. కొంకేపూడి పంచాయతీ పరిధిలోని పంట పొలాలను చెరువుగా మార్చడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. బొడ్డువానిపాలెం సమీపంలో చెరువులుగా మార్చడానికి అనుమతులు తెచ్చుకుని తవ్వేందుకు సిద్ధమయ్యారు. ఈ చెరువు తవ్వితే నందిగామ గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలు దెబ్బతింటాయి. దీనికి కారణం ఈ చెరువులు తవ్వే పంట పొలాల నడుమ నుంచి పంట బోదెలున్నాయి. మెరక కాలువ, పల్లపుకాలువ(మాలకోడు), పేములకోడు పంట కాలువలు(బోదెలు) ఉన్నాయి. ఈ కాలువల ద్వారానే సాగునీరు రావడం, మురుగునీరు పారుదల జరుగుతోంది. అటువంటి ఈ పంటకాలువలు పూడ్చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే అరకొరగా ముంపు బారిన పడుతున్న పంట పొలాలు ఈ చెరువులు తవ్వేతే పూర్తిగా ముంపు బారినే ఉంటాయని ఆందోళన ఉంది. జన్ను, ఆదియ్య, నాంచారయ్య, పోలగాని లక్ష్మీనారాయణ, రాజులపాటి శ్రీను, కేసరి శివయ్య, పామర్తి శ్రీనివాసరావు, బొడ్డు సుబ్బారావు, సోమురాజులు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, వెంకన్న, జన్ను జగన్‌మోహనరావు తదితర రైతులు చెరువులు తవ్వడానికి వీల్లేదని స్పష్టం చేస్తున్నారు.

### తూములు వేశారు.. తొలగించాం



నాకు ఐదెకరాల వరకు పొలం ఉంది. ఇక్కడ చెరువులు తవ్వితే మా పంట పొలాల నుంచి మురుగునీరు పోదు. చెరువు తవ్వేందుకు సిద్ధమయ్యారు. లారీలు పోవడానికి తూములు వేశారు. వాటిని మేం తొలగించాం. అనుమతులున్నాయని అంటున్నారు. మాకు తీవ్ర ఇబ్బందులు వస్తాయి. అధికారులు పునరాలోచన చేసి చెరువులు తవ్వనీయకుండా నిలుపుదల చేయాలి.

– యరగాని రాంబాబు, రైతు, నందిగామ

### పంటలు బీడు బారిన పడ్డాయి



ప్రస్తుతం చెరువుగా తవ్వేందుకు సిద్ధమైన రైతు పంట పొలాలకు పక్కనే ఉన్న చెరువుల వల్ల బీడుగా ఉంచేశారు. ఇప్పుడు చెరువులుగా మార్చడానికి సిద్ధమయ్యారు. ఇలా చెరువులుగా మార్చుకుంటూ పోతే మా పంట పొలాలు కూడా బీడుగా మారే పరిస్థితి ఉత్పన్నమవుతుంది. అప్పుడు మా పరిస్థితి దారుణంగా ఉంటుంది. చెరువుల తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇవ్వకూడదు.

– బొడ్డు హరిబాబు, రైతు, నందిగామ

### పరిశీలించి చర్యలు తీసుకుంటా..



బొడ్డువాని పాలెం వద్ద చెరువులో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయం నా దృష్టికి రాలేదు. రైతులు ఆందోళన చెందుతున్నారనే విషయం మీ ద్వారానే తెలిసింది. మా సిబ్బందిని పంపించి శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. తవ్వకాలకు సంబంధించి అనుమతులను పరిశీలిస్తాం. రైతులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చూస్తాం.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెడన

### నల్ల చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాటం



**కోనేరుసెంటర్:** వక్ఫ్ బిల్లుపై అమలవుతున్న చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని ముస్లిం మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ వేసిన వైఎస్ జగన్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దాదా మాట్లాడుతూ.. ముస్లింల పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించటంలో ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విశేష కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయించారని కొనియాడారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుంటే ముస్లింల ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. ముస్లింల తరఫున సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. నాయకులు రఫీ, అన్వర్, ఇబ్రహీం, మహ్మద్‌సాహెబ్, తాహెరీ, ఖాలీద్, మోసీన్, మీర్ నజాఫ్‌అలీ, గాజుల భగవాన్, చక్రపాణి, షర్ఫూ తదితరులు పాల్గొన్నారు.

# వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు



సభలో వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ బాపిరాజు

**మచిలీపట్నంటౌన్:** ఈ వేసవిలో నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా నీటిని ఏ విధంగా సరఫరా చేస్తారో తెలపాలని పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కమిషనర్ బాపిరాజును ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. తాగునీటి సరఫరా అంశంపై జరిగిన సమావేశంలో అధికారులు, కార్పొరేటర్ల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. కార్పొరేటర్ల ప్రశ్నలకు కమిషనర్ బాపిరాజు స్పందిస్తూ తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూర్తి సామర్థ్యం 5.19 మీటర్లు కాగా ఇటీవల రైవస్ కాలువకు నీరు రావటంతో 5.25 మీటర్ల మేర నీటితో నింపామన్నారు. రెండు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తే రెండు నెలలు నీరు సరిపోతాయన్నారు. మధ్యలో మళ్లీ కాలువకు నీరు విడుదల చేస్తారని అప్పుడు కూడా ఎస్‌ఎస్ ట్యాంక్‌ను నింపుతామని దీంతో తాగునీటి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తామని సభ దృష్టికి తెచ్చారు. మీరు చెబుతున్న దానికి జరుగుతున్న దానికీ చాలా వ్యత్యాసం ఉందని 49వ డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్ ప్రశ్నించారు. పలు ప్రాంతాల్లో ఇప్పుడే కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్‌లకు లీకులు ఏర్పడ్డాయిని, పలు మార్లు ఫొటోలతో సహా ఫిర్యాదు చేసినా మరమ్మతులు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**విద్యుత్ కోతలతో నీటి సరఫరా..**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కమిషనర్ బాపిరాజు చేయించిన అడ్డగోలు పనులపై పూర్తి స్థాయి విచారణకు తీర్మానించి ప్రభుత్వానికి పంపాలని 14వ డివిజన్ కార్పొరేటర్ కాగిత జవహర్‌లాల్‌నెహ్రూ మేయర్‌ను కోరారు. నగరంలోని పలు డివిజన్‌లలో కొత్త చేతి పంపులు వేశారని వీటిని ఎవరి అనుమతితో వేశారని 1వ డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి ప్రశ్నించారు. పాత పంపులకే మరమ్మతులు చేశామని డీఈ కుబియా నాయక్, ఏఈలు చంద్రశేఖర్, రాజేశ్వరరావులు బదులివ్వగా, కొత్త చేతిపంపులకు సంబంధించి ఎలాంటి టెండర్లు ఇంకా ఫైనల్ కాలేదని, కొత్త పంపులు వేయలేదని, నగరంలోని 3 జోన్లలో రూ.15 లక్షలతో చేతి పంపులు వేసేందుకు ప్రతిపాదనలు మాత్రమే చేశామని ఎంఈ చంద్రశేఖర్ వివరించారు. మరి టెండర్‌లే ఫైనల్ కాకుండా ఎవరి ఆదేశాలతో అడ్డగోలుగా కొత్త చేతి పంపులు వేశారని చిరంజీవి ప్రశ్నించగా అధికారులు నీళ్లు నమిలారు. డివిజన్‌లోకి వస్తే కొత్తగా వేసిన పంపులు చూపిస్తానని ఆయన అధికారులకు చెప్పారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కోత లేకుండా మరి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కోత విధించి తాగునీటి సరఫరా చేస్తున్నారని ఇది ఎంతవరకూ సబబని ఆరో డివిజన్ కార్పొరేటర్ పర్ణం సతీష్ ప్రశ్నించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ బదులిచ్చారు. వేసవి వచ్చిన తర్వాత సమావేశం నిర్వహించడాన్ని టీడీపీ కార్పొరేటర్ సమతాకీర్తి తప్పుపట్టారు. పనులను సమర్థవంతంగా చేస్తున్న కమిషనర్ బాపిరాజుకు టీడీపీ సభ్యుడు దింటకుర్తి సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

### కన్యకాంబ ఆలయంలో వైభవంగా శ్రీచక్రార్చన



ప్రవచనం చేస్తున్న అనంతలక్ష్మి, పక్కన సుజాత

**నాగాయలంక:** మండల ఆర్యవైశ్య సంఘం, నాగాయలంక శ్రీవాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీపార్వతీ సమేత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీచక్రార్చన వేడుక వైభవంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మికవేత్త సుజాత మరో 10 మంది మహిళల నేతృత్వంలో పార్వతీదేవీ అమ్మవారి ఎదుట పృథ్వీశ్రీచక్రం రూపొందించి, పారాయణం చేశారు. తొలుత శ్రీచక్రార్చన వేడుకను మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రఖ్యాత ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మికి చైర్మన్ సాంబశివరావు, అర్చకుడు కొల్లిపర సుబ్బారావు, ఆర్యవైశ్య ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నేటి సామాజికాంశాలు, ఆధునిక పోకడ, ఆధ్యాత్మిక ప్రవృత్తులపై అనంతలక్ష్మి ప్రవచనం చేశారు. ఉప్పల నాగేశ్వరరావు, చిట్టా అన్నపూర్ణయ్య, దేసు సత్యనారాయణ, జల్లూరి ప్రకాష్, ఆకుతోట సీతారామయ్య, వంకాయల ఆదిరాజేష్, శేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రసంగిస్తున్న వీసీ రాంజీ

**రుద్రవరం(మచిలీపట్నంరూరల్):** విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా యూనివర్సిటీ వీసీ కె.రాంజీ తెలిపారు. రుద్రవరం పంచాయతీ పరిధిలోని కృష్ణా యూనివర్సిటీ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మైక్రోసాఫ్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన కృష్ణ ద్వివేది, సచిన్ చౌహాన్‌లతో విద్యార్థులకు ఉద్యోగం, ఉపాధిపై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. శిక్షణ తరగతులు పూర్తయిన తర్వాత బహుళ జాతి సంస్థలు వర్సిటీలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇకపై తరచుగా జావా, పైతాన్ వంటి కోడింగ్ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.విజయకుమారి, డాక్టర్ ఎం.బాబురెడ్డి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ములపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సముద్రవేణి

**బంటుమిల్లి:** బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని సీడీపీఓ ఎం.సముద్రవేణి సూచించారు. మండల పరిధిలోని ములపర్రు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు మంగమ్మ, వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబులు పాల్గొని ప్రభుత్వాలు అందజేస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతల సందేహాలను సీడీపీఓ నివృత్తి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

**ఆకుమర్రులో పౌష్టికాహార పక్షోత్సవాలు**

**గూడూరు:** మండల పరిధిలోని ఆకుమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచ్ బొల్లా కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జె.పవిత్ర, పి.యశోద, కె.రాణి, రమాదేవి, ఉమాదేవి, నాగమణి, లక్ష్మీకుమారి, మమత తదితరులు పాల్గొన్నారు.

**పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం**

**పెడన:** పోషకాహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పేర్కొన్నారు. నందమూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పోషకాలు కలిగిన ఆహారాన్ని పండ్లు, కోడిగుడ్లు, చిరుధాన్యాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పోషకాలు లోపించడం వల్ల కలిగే అనర్థాలను వారికి తెలియజేసి మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలను కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్‌ఎస్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### ప్రభుత్వ కళాశాలల్లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



గుణశ్రీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**చల్లపల్లి:** పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ కళాశాలల్లో కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ బైపీసీలో 904 మార్కులు సాధించి కళాశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కేతరాజు గుణశ్రీని పురిటిగడ్డ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ కళాశాలలో చదివి కార్పొరేట్ కళాశాల విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించిన గుణశ్రీని సురేష్‌బాబు అభినందించారు. గుణశ్రీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు బి.నాగలక్ష్మి, కోటేశ్వరరావు, కేతరాజు పృథ్వీలు పాల్గొన్నారు.

### తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

**గూడూరు:** గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అధికారులను ఆదేశించారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి తాగునీటి అవసరాలకు ప్రభుత్వం ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉన్న తాగునీటి చెరువులను నింపుకునేలా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. తాగునీటి సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గూడూరు డీసీ చైర్మన్ పోతన వెంకటలక్ష్మీ నరసింహస్వామి, ఈఓపీఆర్డీ బి.రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థికి కలెక్టర్ అభినందన



**చిలకలపూడి(మచిలీపట్నం):** ఆల్ ఇండియా యూత్ చిల్డ్రన్ ఆర్ట్స్ కాంపిటీషన్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కలెక్టర్ డీకే బాలాజీ ఆయన చాంబర్‌లో మంగళవారం అభినందించారు. మచిలీపట్నం నగరంలోని నిర్మల కళాశాల విద్యార్థిని బొర్రా పరశురామ్ ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఆర్ట్స్ కాంపిటీషన్ ఎగ్జిబిషన్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఉన్నత స్థాయికి ఎదగాలని పరశురామ్‌కు కలెక్టర్ సూచించారు. బొర్రా నటేష్, ఫణికుమార్ పాల్గొన్నారు.

### అభివృద్ధి ప్రణాళిక అమలుకు బృందాల ఏర్పాటు



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు

**పెడన:** రాష్ట్ర ప్రభుత్వం విజన్–2047కు సంబంధించి జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడానికి నియోజకవర్గ స్థాయిలో బృందాలను ఏర్పాటు చేస్తోందని జిల్లా పరిషత్ సీఈఓ కె.కన్నమనాయుడు అన్నారు. పెడన ఎంపీడీవో కార్యాలయంలో బృంద సభ్యులుగా చేరడానికి నియోజకవర్గం నుంచి ఆరుగురు దరఖాస్తు చేయడంతో వారిలో అభివృద్ధి ప్రణాళిక అమలు చేయగలిగే అర్హతలపై మంగళవారం సాయంత్రం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ ఐదుగురు సభ్యులతో బృందాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొనడంతో పాటు తనను పెడన నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా నియమించారని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ వజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలని వినతి

**మచిలీపట్నంఅర్బన్:** జిల్లా సర్వజన ఆస్పత్రిలో హిమోఫీలియా చికిత్స చేసేందుకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలని హిమోఫీలియా సొసైటీ ప్రతినిధి మాగంటి ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. హిమోఫీలియా పేషెంట్లకు ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారని అయితే ఆస్పత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి మరింత మెరుగ్గా వైద్య సహాయం అందించాలని ఆయన కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సొసైటీ సభ్యులు ఉన్నారు.

### రేపు కోడూరు జెడ్పీ పాఠశాల వజ్రోత్సవాలు

**కోడూరు:** స్థానిక కోడూరులోని స్వతంత్రపురం చామర్తి ప్రకాశరామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను గురువారం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం ఆలా వెంకటరమణ మంగళవారం తెలిపారు. పాఠశాలను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో వజ్రోత్సవాలను నిర్వహించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి దోహదపడిన దాతలను సన్మానిస్తామన్నారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని హెచ్‌ఎం తెలిపారు.

### ద్విచక్ర వాహనాలు ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు

**పెడన:** పెడన – బంటుమిల్లి 216 జాతీయ రహదారిపై బల్లిపర్రు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఎదురెదురుగా వచ్చిన రెండు వాహనాలు బలంగా ఢీ కొన్నాయి. ఉయ్యూరుకు చెందిన బి సాయిఈశ్వర్(20), రామవరప్పాడుకు చెందిన వి.నాగవెంకట తేజ(17), కాకర్లమూడికి చెందిన ఆర్.సాయిరామ్(17), కూడూరుకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు(45)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ పరిశీలించి వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com